అంబేడ్కర్‌కు ఘన నివాళి

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంటరానితనం, సామాజిక అసమానత నిర్మూలనకు జీవితం అంకితం చేశారని పలువురు కొనియాడారు. చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామ పంచాయతీ సిబ్బందిని సర్పంచ్ వంగల సరోజన సన్మానించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని స్పందన అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు కోరపల్లి గ్రామానికి చెందిన దొగ్గల సాగర్ పండ్లు పంపిణీ చేశారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో సర్పంచ్ విజయేందర్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. జయంతి వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్ సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్


గన్నేరువరంలో అంబేడ్కర్ సంఘం, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో జయంతి



జమ్మికుంట: స్పందన అనాథ ఆశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


రామడుగులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


చొప్పదండి: నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ


మానకొండూర్‌రూరల్: లింగాపూర్‌లో...


హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లిలో ప్రజాప్రతినిధులు, నాయకులు


చిగురుమామిడిలో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ కొత్త వినీత, తదితరులు


శంకరపట్నం: జయంతి సందర్భంగా మెట్‌పల్లి జీపీ సిబ్బందికి సన్మానం


సైదాపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు


తిమ్మాపూర్: మహాత్మానగర్‌లో నాయకుల నివాళి


గంగాధర: నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు కుమార్


ఇల్లందకుంట: అంబేడ్కర్‌చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ పావని


ఇల్లందకుంట: జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు


శంకరపట్నం: కేశవపట్నంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

రహదారులపై వరి ధాన్యం

- రైతులను హెచ్చరిస్తున్న పోలీసులు
- నిండుకుంటున్న కల్లాలు
- బెంబేలెత్తిస్తున్న అకాల వర్షాలు
- భయం గుప్పిట్లో అన్నదాతలు
- కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్

మానకొండూర్: ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన వరిపంట చేతికందుతోంది. మండలంలో వరికోతలు జోరుగా సాగుతుండటంతో రైతులు వివిధ పనుల్లో బిజీగా ఉంటున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆవరణ, కల్లాలు నిండుకుంటున్నాయి. మరోవైపు అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు వెంట వెంటనే చేపడితే రైతులు పడ్డ కష్టానికి ఫలితం దక్కినట్టే, కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జాడ లేదు. దీంతో రైతులు ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే చాలూ అక్కడే ధాన్యం కుప్పలుగా పోస్తున్నారు.

రహదారులపై ఆరబోయొద్దు

కల్లాలు ఇప్పటికే నిండుకోవడంతో రైతులు ధాన్యాన్ని రహదారులపై ఆరబోస్తున్నారు. రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కేసులు పెడతామని పోలీసులు రైతులను హెచ్చరిస్తున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం త్వరగా కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించాలని కోరుతున్నారు.

మండలంలో...

మండలంలోని రైతులు యాసంగిలో 30 వేలకుపైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు 7.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించే వచ్చే అవకాశం ఉంది.


ఖాదర్‌గూడెం గ్రామంలో ధాన్యం రాశులు


రహదారులపై ధాన్యం ఆరబోయొద్దని రైతులను హెచ్చరిస్తున్న పోలీసులు

ఇప్పటికే వన్నారం, గట్టుదుద్దెనపల్లి, ఖాదర్‌గూడెం, మద్దికుంట, పచ్చునూర్, వెల్ది, వేగురుపల్లి, ఊటూరు, దేవంపల్లి పలు గ్రామాల్లో వరికోతలు ఊపందుకున్నాయి. అకాల వర్షాలతో వేగురుపల్లి, ఊటూరు, పచ్చునూర్, మద్దికుంట గ్రామాల్లోని రైతులు నష్టపోయారు. ఆయా గ్రామాల్లోని కల్లాలు ధాన్యం రాశులతో నిండిపోగా రైతులు సమీప గ్రామాల కల్లాల్లోకి ధాన్యం తరలిస్తున్నారు. ఖాళీ స్థలం కనబడితే అక్కడే ధాన్యం ఆరబోస్తున్నారు.

కొనుగోళ్లు చేపడితే సమస్యలు తప్పినట్లే

ధాన్యం కల్లాల్లో, రహదారులపై పేరుకుపోక ముందే ప్రభుత్వం కొనుగోళ్లు చేపడితే ఇబ్బందులు తప్పినట్టేనని రైతుల అంటున్నారు. కల్లాలు నిండుకున్న దానికంటే ముందే కొనుగోళ్లు చేపట్టాలని, ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

కిరాయి పెరుగుతోంది



అకాల వర్షాలతో పంట చేతికందుతుందో లేదోనని వరికోతలు ముందుగానే చేపడుతున్నారు. తేమ శాతం కోసం తప్పనిసరి కల్లాల్లో ధాన్యం ఆరబోసుకోవాల్సి వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు ప్రతిసారి ఆలస్యం అవుతుండటంతో రోజుల తరబడి ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచాల్సి వస్తోంది. పరదాలు కిరాయి పెరుగుతోంది, కొనుగోళ్లు త్వరగా చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– వంగ అంజయ్య, రైతు, ఖాదర్‌గూడెం

రోడ్లపై ఆరబోస్తున్నాం



మూడెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాను. పంట కోత దశలో ఉంది. మాది కెనాల్ కింది ఆయకట్టు గ్రామం. ఖాళీ స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అందుకే రహదారులపై ధాన్యం ఆరబోస్తున్నాం. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ఎప్పటికప్పుడు చేపడితే అధికార యంత్రాగానికి, రైతులకు ఇబ్బందులు ఉండవు.

– మద్దెల స్వామి, రైతు, వన్నారం

నీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు

చొప్పదండి: ఎస్సారెస్పీ నుంచి డీ87 ఉపకాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న ఉపకాలువ వద్ద ప్రధాన రోడ్డుపై బైఠాయించి రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. చొప్పదండితో పాటు కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట శివారులో ఉన్న వరిపంట చివరిదశలో ఉన్నందున మరోమారు ఎస్సారెస్పీ నీరు విడుదల చేసి పంటలను, రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు. సీఐ రవీందర్ ఆందోళన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఎస్సారెస్పీ ఏఈతో మాట్లాడించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో తిరుపతి, శేఖర్, రాజశేఖర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, కచ్చు శ్రీనివాస్, వీరేశం, శ్రీనివాస్, వేణు, వెంకటయ్య, శ్రీకాంత్, లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆదరణను ఓర్వలేకపోతున్నారు

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీకి వస్తోన్న ఆదరణను బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని పార్టీ గన్నేరువరం మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనిల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫామ్‌హౌస్ సీసీ ఫుటేజీలు బయట పెట్టాలని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన సవాల్‌ను బీఆర్‌ఎస్ నాయకులు స్వీకరించి, బహిరంగ చర్చకు రావాలని కోరారు. కవ్వంపల్లి అనురాధ పారపాటుగా మాట్లాడితే క్షమాపణ చేప్పడానికి సిద్ధమని, అభివృద్ధిపై ప్రగల్భాలు పలకడమే తప్పా ప్రభుత్వ కార్యాలయాలకు పునాది వేసింది లేదని విమర్శించారు. డబుల్ రోడ్డుకు నాలుగు నెలల క్రితం నిధులు వచ్చాయని సంబరాలు చేసుకున్నారనే తప్పా పనులు చేపట్టడం లేదని ఎద్దేవా చేశారు.


మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి, నాయకులు

కాంగ్రెస్ నాయకులను బ్రోకర్లుగా సంబోంధించడాన్ని ఖండించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, జాని, విజేందర్, అనిల్, శ్రీకాంత్, సంపత్, సతీష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాములు, వంశీకృష్ణరెడ్డి, ప్రశాంత్, మల్లికార్జున్, చింటూ పాల్గొన్నారు.

16న 'మోడల్' ప్రవేశ పరీక్ష

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ కోరారు. శుక్రవారం చిగురుమామిడిలో మాట్లాడారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష ఉంటుందని, 7 నుంచి 10 తరగతుల్లో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫ్యాన్లు వితరణ

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు తెలంగాణ జాగృతి నియోజకవర్గ కన్వీనర్ పోలు రాము ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యాన్లు అందించారు. వేసవి కాలం దృష్ట్యా చిన్నారుల సంరక్షణకు ఫ్యాన్లు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పోలు రమేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాన్లు అందిస్తున్న తెలంగాణ జాగృతి నియోజకవర్గ కన్వీనర్ పోలు రాము

పోస్టర్ ఆవిష్కరణ

జమ్మికుంట: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ కరీంనగర్ జిల్లా సమన్వయకర్త ఆరెల్లి మల్లాగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కందాల శోభారాణి యాది సభ పోస్టర్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో శనివారం సభ నిర్వహిస్తున్నామని, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సహాయ సమన్వయ కర్త అంజయ్య, సామాజిక కార్యకర్తలు ముక్కెర విజయ్, నాగపూరి విజయ్, పోల్లాల మధు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రత్యేక బస్సుల్లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు

హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి శుక్రవారం అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పలువురు కొనియాడారు. నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు పయనమయ్యారు. ఈసందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

- సాక్షి నెట్‌వర్క్


ఇల్లందకుంట: హైదరాబాద్‌కు వెళ్తున్న అధికారులు, నాయకులు


రామడుగు: హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు వెళ్తున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్